# ఆస్తిపన్నులపై 5-శాతం ఎర్లీ బర్డ్ రాయితీ

## -ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి విజ్ఞప్తి

**రామాయంపేట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రప్రభుత్వ మార్గదర్శకాలమేరకు రామాయంపేట మున్సిపల్‌పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఎర్లీ బర్డ్ స్కీమ్ కింద రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నులు ఏప్రిల్ 1 నుండి ఏప్రిల్ 30, 2026 మధ్య చెల్లించేవారికి 5శాతం రాయితీ (రిబేట్) ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. పట్టణప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తక్కువ మొత్తంలో పన్నులు చెల్లించుకోవాలని సూచించారు. పన్నులు బిల్ కలెక్టర్ల వద్ద, సిఎస్‌సి కౌంటర్లు, ఈసేవ, మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ ద్వారా సులభంగా చెల్లించవచ్చని తెలిపారు. పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలని, గడువులోపు పన్నులు చెల్లించి రాయితీ పొందాలని ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తిచేశారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# నారసింహ నామస్మరణతో మార్మోగిన నాచగిరి

## -వైభవంగా సాగిన గిరిప్రదక్షణ కార్యక్రమం

**వర్గల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ్మాస్వామి క్షేత్రంలో స్వామివారి జన్మనక్షత్రం(స్వాతి)ని పురస్కరించుకొని శనివారం ఉదయం గిరిప్రదక్షణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. రంగంపేటపీఠాధిపతి మాధవానందసరస్వతి స్వీయపర్యవేక్షణలో గిరిప్రదక్షణ కార్యక్రమం జరుగగా అశేషభక్తజనవాహిని పాల్గొనడం జరిగింది. గిరిప్రదక్షణలో పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు చేసిన నారసింహ నామస్మరణతో ఆలయపరిసరాలు మార్మోగాయి. అనంతరం భక్తులకు భానుమూర్తికుటుంబ సభ్యులు అల్పాహారం ఏర్పాటుచేయగా, తూప్రాన్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు మజ్జిగను అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ పి.రవీందర్‌గుప్తా, కార్యనిర్వహణాధికారి బెల్లంకొండ రంగాచారి, ధర్మకర్తలు చందా నాగరాజు, గాలి కిష్టయ్య, కొత్తపల్లి శ్రీనివాస్, ఉషశ్రీ రాజశేఖరశర్మ, కర్రె పద్మా వెంకటేష్, జక్కన్నగారి సురేందర్‌రెడ్డి, కూచవరం సంతోష్‌కుమార్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# బహిరంగసభకు అందరూ ఆహ్వానితులే

## -జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి సందర్భంగా ఈ నెల 5వ తేదీ (ఆదివారం) ఉదయం 9గంటలకు ఆర్అండ్‌బి కార్యాలయం పక్కనగల డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్పమాలాలంకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డిపట్టణంలోని నటరాజ్‌థియేటర్ పక్కన, కల్వకుంటరోడ్ వద్ద బహిరంగసభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ కులసంఘాల నాయకులు, బడుగు, బలహీన వర్గాల నాయకులు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు.



జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

# ఆర్ఆర్ఆర్ పరిహారం చెల్లింపులపై అదనపు కలెక్టర్ పరిశీలన

**చౌటకూరు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
ఆర్ఆర్ఆర్ పరిధిలో భూముల సేకరణకు సంబంధించి పరిహారం అందించేందుకు శనివారం అదనపు కలెక్టర్ పాండు మండలకేంద్రమైన చౌటకూరులోని తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలన చేశారు. అధికారులుచేపడుతున్న పనుల పురోగతివివరాలను పాండు అడిగి తెలుసుకున్నారు. పరిహారం చెల్లింపులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ పాండు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నామాల కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి ఫోటోను తొలగించిన ప్రతాప్‌రెడ్డి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రేవంత్‌రెడ్డి ఫోటోను తొలగిస్తున్న ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు అక్రమంగా చొరబడి కార్యాలయంలో కెసిఆర్ ఫోటోను తొలగించి సిఎం రేవంత్‌రెడ్డి ఫోటోను ఏర్పాటుచేయగా ఆఫోటోను మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కార్యాలయంలో నుంచి తొలగించారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులకు ఎలాంటి అనుమతిలేకుండా క్యాంపు ఆఫీసులోకివచ్చి రేవంత్‌రెడ్డి ఫోటోను పెట్టారని, దేశంలో చట్టాలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం ఫోటో పెట్టాలని ఏ ప్రభుత్వ ఆర్డర్ జివో రూల్స్‌లో ఉండదన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రభుత్వ ఆఫీసుకాదని, అది ఎమ్మెల్యే వ్యక్తిగత రాజకీయ కార్యాలయమని, అక్కడ ఆయన వ్యక్తిగత ఫోటోలు, బ్యానర్లు పెట్టుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఆఫీసులు, సెక్రటేరియట్, జిల్లా ఆఫీసులలో మాత్రమే రాష్ట్రపతి, ప్రధాని, సిఎం లాంటి అధికారిక ప్రోటోకాల్ ఫోటోలు ఉంటాయని ఈ సందర్భంగా వంటేరు ప్రతాపరెడ్డి పేర్కొన్నారు.

# ఇసుక ఫిల్టర్‌లను ధ్వంసంచేసిన రెవెన్యూ అధికారులు



ఇసుక ఫిల్టర్‌ను తొలగిస్తున్న దృశ్యం

## వార్త కథనానికి స్పందన

**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
వార్త కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. కందిమండలం ఆరుట్ల, బ్యాతోల్ గ్రామాలలో అక్రమ ఇసుకరవాణా జరుగుతున్న విషయాన్ని వివరిస్తూ శుక్రవారం వార్త దినపత్రికలో యథేచ్ఛగా కృత్రిమ ఇసుకతయారీ శీర్షికన ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన కంది ఆర్ఐ రంగయ్య, జిపిఓలు దేవిప్రసాద్, ఇష్తిఖార్‌అలీ బృందం శనివారం ఆరుట్ల బ్యాతోలు గ్రామాలలోని ఇసుక కృత్రిమతయారీకి ఉపయోగించే ఫిల్టర్‌లను జెసిబిలతో ధ్వంసంచేశారు.

# అసాధారణమైన 8 అడుగుల తోటకూర చెట్టు

**రాయపోల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
సాధారణంగా పంటపొలాల్లో పెరిగే తోటకూర మొక్కలు 2 నుండి 4 అడుగుల ఎత్తులోనే ఉండడం మనం చూస్తుంటాం. అయితే దౌల్తాబాద్ మండలంలోని శౌరిపూర్ గ్రామంలో ఓ తోటకూర మొక్క అసాధారణంగా పెరిగి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గ్రామానికి చెందిన యువరైతు చెన్న భీమ్‌రాజు వంకాయ తోటలో స్వయంగా మొలకెత్తిన తోటకూర మొక్కలు బాగా పెరిగాయి. వాటిలో ఒక మొక్క ఏకంగా 8 అడుగుల ఎత్తుకు పెరిగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాధారణ పరిమాణాన్ని మించి ఇంత ఎత్తుపెరగడం స్థానికులను ఆశ్చర్యపరుస్తోంది. ఈ అరుదైన తోటకూర చెట్టును చూడటానికి దారిన వెళ్లే వారు ఆగి ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. ప్రకృతి వైవిధ్యాన్ని చాటిచెప్పే ఈ తోటకూరమొక్క ప్రస్తుతం గ్రామంలో అందరికీ చర్చనీయాంశంగా మారింది.



ఎనిమిది అడుగులు పెరిగిన తోటకూర చెట్టు

# పరిశ్రమ ఏర్పాటు చేయవద్దని గ్రామస్థుల నిరసన



ఫార్మ పరిశ్రమ వద్దని నిరసన వ్యక్తంచేస్తున్న గ్రామస్థులు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మండలపరిధి మిర్జాపల్లిలో కాలుష్య పరిశ్రమను ఏర్పాటుచేస్తే ఊరుకునేదిలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం మిర్జాపల్లి శివారులోని 179 సర్వే నంబర్‌లో వినూత్న పరిశ్రమను నిర్మించడానికి ప్రయత్నించడంతో గ్రామస్థులు అక్కడికిచేరుకొని నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ అనుమతులులేకుండా పరిశ్రమను ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. గతంలో కూడా పరిశ్రమ వద్దని ఆందోళన చేశామని, పనులు ఆపేసి ఇప్పుడు మళ్లీ మొదలుపెట్టడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందించారు. పరిశ్రమ ఏర్పాటుచేస్తే పెద్ద ఎత్తున ఆందోళనచేస్తామని హెచ్చరించారు.

# ముఖ్యమంత్రి చిత్రపటంపై రేగిన రగడ

## -గజ్వేల్‌లో ఉద్రిక్తత
## -క్యాంప్ ఆఫీసులో రేవంత్‌రెడ్డి ఫోటోపెట్టిన కాంగ్రెస్‌నేతలు
## -క్యాంప్ ఆఫీసుపై దాడిచేశారంటూ బిఆర్ఎస్ నాయకుల నిరసన
## -దాడిని ఖండించిన మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



సిఎం రేవంత్‌రెడ్డి ఫోటోను పెడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి

**గజ్వేల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు నివాస భవనమైన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్‌పార్టీ నాయకులు దాడిచేయడంపట్ల మాజీ మంత్రి హరీష్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిలు తీవ్రంగాఖండించారు. శనివారం గజ్వేల్ పట్టణంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి కార్యాలయంలో సిఎం రేవంత్‌రెడ్డి ఫోటోపెట్టి పెద్దయెత్తున నిరసన తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ఇందిరాపార్కు చౌరస్తావరకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి బిఆర్ఎస్‌పై విరుచుకుపడ్డారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచి రెండు సంవత్సరాలు గడుస్తున్నా గజ్వేల్ ప్రజల సమస్యలను కెసిఆర్ పట్టించుకోవడంలేదని, కెసిఆర్ వెంటనే ప్రజాక్షేత్రంలోకిరావాలని డిమాండ్‌చేశారు. క్యాంప్ ఆఫీసుపై దాడికి వెళ్లలేదని, క్యాంప్ ఆఫీసులో సిఎం రేవంత్‌రెడ్డి ఫోటోపెట్టడానికి మాత్రమే వెళ్లినట్లుతెలిపారు. దీనిని దాడిచేశామంటూ బిఆర్ఎస్ నాయకులు అపోహలు సృష్టిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులను అడిగేహక్కు అందరికీ ఉంటుందని, ప్రజాప్రతినిధిగా ఎన్నికై ప్రజలకు ముఖంచాటేస్తే ఎవరూ ఊరుకోరని హెచ్చరించారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు పెద్ద ఎత్తున క్యాంప్ ఆఫీస్‌వద్దకు వెళ్లగానే గజ్వేల్ సిఐ రవికుమార్ హుటాహుటిన అక్కడికివెళ్లి కార్యకర్తలను, నాయకులను అడ్డుకొని అక్కడినుంచి పంపించారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిలు క్యాంప్ ఆఫీస్‌పైదాడిని తీవ్రంగా ఖండించారు. రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకే దాడిజరిగిందని, ప్రజాస్వామ్యంపై సిఎం చేసినదాడిగా వర్ణించారు. పట్టపగలు అధికారమదంతో విర్రవీగుతూ సోయిమరిచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తుందన్నారు. ప్రజాప్రతినిధుల క్యాంప్ కార్యాలయాలపై దాడులుచేస్తుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్టా లేనట్టా అని ప్రభుత్వంపై మండిపడ్డారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజాప్రతినిధులపై దాడులు, ప్రజాసంఘాలపై, మీడియాపై దాడులు నిత్యకృత్యంకావడం సిగ్గుచేటన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్‌పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం పేరుతో గూండాల రాజ్యం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటిదాడులు పునరావృతం అయితే సహించేదిలేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధిలోకి రావాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రజలంతా వీధిలోకి వస్తే వీరంతా ఎక్కడ ఉంటారో ఆలోచించుకోవాలని పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి

## -కెసిఆర్ చిత్రపటం తొలగింపు, రేవంత్‌రెడ్డి చిత్రపటం ఏర్పాటు



ర్యాలీ నిర్వహిస్తున్న ఆంక్షరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

**గజ్వేల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిచి రెండు సంవత్సరాలు అవుతున్నా కెసిఆర్ ప్రజలకు అందుబాటులోకి రావడంలేదని శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముట్టడించి కార్యాలయంలో ఉన్న కెసిఆర్ చిత్రపటాన్నితొలగించి సిఎం రేవంత్‌రెడ్డిచిత్రపటాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం కెసిఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ క్యాంప్ కార్యాలయం నుండి ఇందిరాపార్కు చౌరస్తా వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ ఇప్పటికే రూ.కోటి 20 లక్షల రూపాయల వేతనం, ఇతర అలవెన్సులు పొందినట్లు ఆరోపించారు. గజ్వేల్ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్న ఆయనను వెంటనే ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని డిమాండ్‌చేశారు. గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండని కెసిఆర్ ఒక్కక్షణం కూడా ఎమ్మెల్యేగా కొనసాగే నైతికహక్కు లేదని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్‌గుప్తా, మండలపార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, కనకయ్యగౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, వెంకటేష్, జిల్లా మైనార్టీసెల్ నేత సమీర్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయిని సత్యలక్ష్మి యాదగిరి, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, జంగం రమేష్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.

# జాలిగామ గ్రామంలో కౌలురైతు ఆత్మహత్య

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
ఆర్థిక ఇబ్బందులతో కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. జాలిగామ గ్రామానికి చెందిన గుడిసె లక్ష్మణ్ అనే కౌలురైతు వ్యవసాయమే జీవనాధారంగా నమ్ముకొని కొంతభూమిని కౌలుకుతీసుకొని అప్పులుచేసి వ్యవసాయం చేయగా ఆశించినస్థాయిలో పంటదిగుబడి రాకపోవడంతో పెట్టినపెట్టుబడి కూడా రాలేదు. దీంతో తీవ్రమనస్తాపానికి గురైన లక్ష్మణ్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతునికి భార్య కళ్యాణితోపాటు ఇద్దరు కూతుర్లు వనజ(5), సహ్విక(3)లు ఉన్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన లక్ష్మణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. విషయంతెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని లక్ష్మణ్ మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.

# అక్రమబియ్యం తరలిస్తున్న 3 లారీల పట్టివేత

## -880 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం



పోలీసులు పట్టుకున్న అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీలు

**పుల్‌కల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్న మూడు లారీలను పుల్‌కల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ నెల 2న రెండులారీలను పట్టుకోగా శుక్రవారం మరోలారీని పట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని యాద్‌గిర్ జిల్లా గురుమిట్కల్ నుంచి జెజె25యు9759, జెజె25డబ్ల్యు4065 లారీల్లో 340 క్వింటాళ్ల చొప్పున 680 క్వింటాళ్ల రేషన్‌బియ్యం గుజరాత్ తరలిస్తుండగా తాడ్దానిపల్లి టోల్ ప్లాజా వద్ద ఎస్ఐ నల్లా విశ్వజన్ పట్టుకున్నారు. హైద్రాబాద్ నుంచి గుజరాత్‌కు 200 క్వింటాళ్ల బియ్యంతో వెళుతున్న ఎపి36వై4479 లారీని సైతం ఎస్ఐ అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న 3లారీలను, అక్రమ రేషన్‌బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వజన్ వివరించారు.

# బస్సు నుండి జారిపడి వ్యక్తి దుర్మరణం

**రాయపోల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
రన్నింగ్ బస్సులోనుండి ప్రమాదవశాత్తుజారిపడి ఓవ్యక్తి దుర్మరణంచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన యాకటి నర్సింలు(43) అహ్మద్‌నగర్ నుండి బెజుగామ గ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీబస్సు ఎక్కాడు. బస్సు చిన్నమాసాన్‌పల్లి స్టాప్‌కు చేరుకునేముందు సుమారు 200మీటర్ల దూరంలోనే కండక్టర్ స్టాప్ వచ్చిందని తెలియజేయడంతో నర్సింలు దిగడానికి హడావుడిగా ముందుకువచ్చి బస్సు మెట్లవద్ద నిలబడ్డాడు. ఈసమయంలో అతని కాలుజారి కిందపడిపోగా, బస్సు వెనుకచక్రం అతని తలపైనుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ మానస తెలిపారు.

# వెలవెలబోతున్న మినీ ట్యాంక్ బండ్

## -నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన సదుపాయాలు

**మెదక్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
పట్టణాభివృద్ధికి ప్రతీకగా నిలవాల్సిన మినీ ట్యాంక్ బండ్ ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరుతోంది. కోట్లరూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ప్రదేశం సరైన సంరక్షణ లేక ప్రజలకు ఉపయోగపడకుండా వెలవెలబోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. పిట్లంబేస్ స్థలంలో నిర్మించిన వాచ్ టవర్, షెల్టర్ భవనం పూర్తిగా నిర్లక్ష్యానికి గురై, చుట్టూ ముళ్ల పొదలు పెరిగి, చెత్తాచెదారం పేరుకుపోయి ఉంది. గోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రజలు కూర్చొని విశ్రాంతి తీసుకునేస్థలం పనికిరాకుండా, నిరుపయోగంగా మారింది. సదుపాయాల అభివృద్ధి కోసం ఖర్చుచేసిన నిధులు వృథా అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ట్యాంక్ బండ్‌కు వెళ్లే రహదారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మట్టిరోడ్డుగా మారిపోయిన మార్గం ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగి, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తోంది. రోడ్డుపక్కన చెత్తపడేయడంతో అస్వచ్ఛత నెలకొంది. సాయంత్రంసమయంలో వెలుతురు లేక భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఈప్రదేశాన్ని పర్యాటకకేంద్రంగా అభివృద్ధిచేస్తామని హామీలు ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు అమలుకాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బోటింగ్, పార్కులు, లైటింగ్ వంటి సదుపాయాలు ఏర్పాటుచేసి ఉంటే కుటుంబాలతో వచ్చి విశ్రాంతితీసుకునే మంచికేంద్రంగా మారేదని స్థానికులు అంటున్నారు. మినీట్యాంక్‌బండ్ ప్రాంతాన్ని శుభ్రపరిచి, రహదారిని సరిచేసి, భద్రత, లైటింగ్ సదుపాయాలు కల్పించి, పర్యాటక కేంద్రంగా అభివృద్ధిచేయాలని, ప్రస్తుతపరిస్థితిని గమనించిన ప్రజలు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని హెచ్చరిస్తున్నారు.



పిట్లంబెస్‌లో వాచ్ టవర్, షెల్టర్ భవనం చుట్టూ ముళ్ల పొదలు

# హోటళ్లు, బేకరీలపై మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

## -పరిశుభ్రతా లోపాలపై జరిమానాలు
## -నాణ్యతలేని ఆహారంపై కేసుల హెచ్చరిక



రామాయంపేట బేకరీలో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

**రామాయంపేట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణంలో మున్సిపల్ మేనేజర్ రఘువరన్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు శనివారం వివిధ హోటళ్లు, బేకరీలు, కిచెన్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించని సంస్థలపై చర్యలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా బస్టాండ్ సమీపంలోని సింగపూర్ బేకరీ, గోల్డెన్ బేకరీలకు రూ.5,000 చొప్పున జరిమానా విధించగా, డైమండ్ హోటల్‌కు 1,000 రూపాయల జరిమానా విధించారు.

అనంతరం మేనేజర్ రఘువరన్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని హోటళ్లు, ఆహారశాలలు తప్పనిసరిగా పరిశుభ్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా, వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహార పదార్థాలనే ఉపయోగించాలని, గడువు ముగిసిన వస్తువులు ఉపయోగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టంచేశారు.

ఈతనిఖీలలో మున్సిపల్ అధికారులు శ్రీధర్‌రెడ్డి, బాలకృష్ణ, సిబ్బంది నవాత్ ప్రసాద్, కాలేరు ప్రసాద్ పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

## -ఏడుగురిపై కేసు నమోదు, రూ.9,070 నగదు స్వాధీనం

**ములుగు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
పేకాట స్థావరంపై ములుగు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడిచేశారు. మండలపరిధిలోని మాసంపల్లి గ్రామ సమీపంలోని కోమటికుంట కట్ట వద్ద పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారంతో దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న ములుగు గ్రామానికి చెందిన తిగుళ్ల మహేందర్, గుర్రగోటి చెన్నయ్య, కుతాడి రాజు, ములుగుమండలం నాగిరెడ్డిపల్లికి చెందిన కూచారం వెంకటేష్, వర్గల్‌మండలం రామక్కపేట్ గ్రామానికి చెందిన చిందం సురేష్, వర్గల్‌కు చెందిన కూరాకుల దర్శన్, సింగాయపల్లికి చెందిన నగరం సత్తయ్యలపై కేసు నమోదు చేసి వారి వద్ద నుండి రూ.9,070 నగదుతో పాటు 6 మొబైల్ ఫోన్‌లు, 6 మోటార్ సైకిళ్లు, 105 పేకముక్కలు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# నేడు ఇసుక అక్రమ నిల్వలకు వేలం

## -తహసీల్దార్ శ్రీనివాస్‌చారి

**కొల్చారం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను సోమవారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, పోతంశెట్టిపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు ట్రాక్టర్ల ఇసుకను శుక్రవారం సీజ్‌చేసినట్లు చెప్పారు. సీజ్ చేసిన ఇసుకను సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పోతంశెట్టిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలంద్వారా విక్రయిస్తామని, ఇసుక అవసరం ఉన్నవారు వేలంలో పాల్గొనాలని, వేలంలో పాల్గొనదలచిన వారు రూ.10,000 డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు.

## నిమ్స్‌లో మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం


డాక్టర్ నగరి బీరప్ప

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 4, ప్రభాతవార్త: పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, ఆసుపత్రి పరిపాలన విభాగం ఆధ్వర్యంలో మహిళల కోసం ఈ నెల 7న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్, కౌన్సెలింగ్, అవగాహన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. శిబిరంలో భాగంగా బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ గర్భద్వార క్యాన్సర్‌పై దృష్టి సారించనుందని, నిమ్స్‌లోని రేడియేషన్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, గైనకాలజీ, రేడియాలజీ విభాగాల నిపుణులు పాల్గొని సేవలు అందిస్తారన్నారు. ఈ శిబిరం ద్వారా మహిళల ఆరోగ్యంపై దృష్టి, క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం, నిపుణుల వైద్య సలహాలు, నివారణ చర్యలపై అవగాహన, లక్షణాలు, చికిత్సలపై మార్గదర్శనం నిర్వహిస్తామన్నారు. మహిళలకు స్క్రీనింగ్, గైడెన్స్, కౌన్సెలింగ్ అందిస్తారని ఆయన తెలిపారు. నిమ్స్ ఆంకాలజీ బ్లాక్‌లోని రేడియేషన్ ఆంకాలజీ వేయిటింగ్ హాల్‌లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ముందస్తు గుర్తింపు ద్వారా మెరుగైన ఆరోగ్య ఫలితాలను పొందాలని డైరెక్టర్ పిలుపునిచ్చారు.

## కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు


హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నిజాంపేట్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీకి నూతనంగా నియమితులైన సభ్యులు శనివారం కలిశారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్ ఆమోదంతో, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో ఈ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా సెక్రటరీలు మొహమ్మద్ జాకీర్, సంతోష్ ముదిరాజ్‌లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్‌లో వీధిదీపం కోసం ఆందోళన

ఖైరతాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాతవార్త):

ఖైరతాబాద్ మారుతీనగర్ ఎంట్రన్స్ వద్ద ఉన్న కమ్యూనిటీ హాల్ సమీపంలో మూడు వారాలుగా వీధి దీపం లేకపోవడం స్థానికుల్లో ఆందోళనకు గురిచేస్తోంది. ప్రాంతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు మారినా, మౌలిక సదుపాయాలపై నిర్లక్ష్యం కొనసాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు వారాలుగా వీధి దీపం అమర్చకపోవడం శోచనీయం అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో చీకటి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతూ, భద్రతపై కూడా భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వీధిదీపం ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్య అధికారుల దృష్టికి వెళ్లినా ఎందుకు పరిష్కారం కాలేదని ప్రశ్నిస్తున్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులు



అత్తాపూర్ ఏప్రిల్ 4,ప్రభాతవార్త :

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని పీఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ నార్సింగి పాఠశాల విద్యార్థులు శనివారం సందర్శించారు వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు రామ్ రెడ్డి హుస్సేన్ విద్యార్థులకు పలు విశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు రామేశ్వరి, పద్మ, రాజేశ్వరి పల్లవి గాయత్రి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మహనీయుల జయంతి ఉత్సవాలు



అత్తాపూర్ ఏప్రిల్ 4,ప్రభాతవార్త :

మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్,అత్తాపూర్ సర్కిల్ జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శనివారం ప్రేమ్‌వతి పేటలో మహనీయుల జయంతి కమిటీ సభ్యులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ….మహనీయుల జయంతి కమిటీ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని నేడు(ఆదివారం) బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఆరాంఘర్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి ఘన నివాళులర్పించి ఉత్సవాలను నిర్వహిస్తామని అదేవిధంగా ఈనెల 14 (మంగళవారం) అంబేద్కర్ జయంతిని రాజేంద్రనగర్ చౌరస్తాలో పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి అతిథులుగా అసెంబ్లీ స్పీకర్ గడ్డ ప్రసాద్ కుమార్,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,దామోదర రాజనర్సింహ,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి,మాజీ మంత్రి సబితారెడ్డి,ఎంఆర్‌పిఎస్ జాతియ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ,దళిత సేన అధ్యక్షులు జె.బి రాజు,ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి,స్వామిగౌడ్,మాజీ ఎంపి రంజీత్ రెడ్డి,తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దాసరి రమేష్,వైస్ చైర్మన్ నందిగామ నర్సింహ్మా, ప్రధాన కార్యదర్శి మంగళారం శ్రీనివాస్,కోశాధికారి పలుగు చెరువు మహేందర్ ,ఉప కోశాధికారి ఎడ్లకాడి చంద్రశేఖర్,ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గం నియామకం

హైదరాబాద్, ఏప్రిల్ 4,ప్రభాతవార్త:

అఖిలభారత వడ్డెర సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దండుగుల మైసయ్య రాష్ట్ర కార్యవర్గాన్ని నియమించారు. తెలంగాణ మహిళా అధ్యక్షురాలుగా బోదాసు మాధవి ని నియమించడం జరిగినది. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ ఆలకుంట్ల రాజమ్మను నియమించారు. అలాగే గ్రేటర్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపు సారంగపాణి, సూర్యాపేట్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొంచెం యాదగిరి, సూర్యాపేట జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ గుంజి ఉస్మార్,మేడ్చల్ జిల్లా కార్మిక అధ్యక్షుడిగా గోపాల్‌ని నియమించడం జరిగినది అలాగే కుత్బుల్లాపూర్ నియో జక వర్గం చింతల్ సర్కిల్‌కు అధ్యక్షుడిగా సురేష్‌లుగా నియమిం చారు. ఈకార్యక్రమంలో అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం, ప్రెసిడెంట్ వేముల లక్ష్మణ్, హాజరయ్యారు

## ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నిజాంపేట్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మధురానగర్‌లో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఈ పర్యటనలో రోడ్ల నిర్మాణం, మరమ్మత్తులు, పారిశుద్ధ్య నిర్వహణ, దోమల సమస్య, వీధి దీపాల మరమ్మత్తులు, మంజీరా నీటి డ్రైజర్, స్మశాన వాటికల అభివృద్ధి, సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ల నిర్వహణ, వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల ఏర్పాటు, చెరువుల సుందరీకరణ వంటి అంశాలపై సమీప కాలనీల వాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. గత 12 సంవత్సరాలలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. గ్రామ పంచాయతీ స్థాయి నుండి కార్పొరేషన్ స్థాయికి, నేడు జిహెచ్ఎంసి విలీనంతో నిజాంపేట్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని, పెరుగుతున్న జనాభా, పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఉప కమిషనర్ సాబేర్ అలీ, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్ కుమార్, ఎస్.డబ్ల్యూ.ఎం శరన్ తేజ, నిజాంపేట్ సర్కిల్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పూలే జయంతిని కూడా ఘనంగా నిర్వహించాలి : జాజుల శ్రీనివాస్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

**సైఫాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** ఏప్రిల్ 14వ తేదీన రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం ఏ విధంగా నిర్వహిస్తున్నదో ఆదే విధంగా అంబేద్కర్ గురువైన మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని కూడా ఈ నెల 11వ తేదీన నిర్వహించాలని బిసి జెఎసి రాష్ట్ర ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం బిసి జెఎసి కార్యాలయంలో ఆర్టీసీ బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.తిరుపతయ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో 28 వేల మంది బిసి ఉద్యోగులు పనిచేస్తూ ప్రయాణికులకు విశేషమైన సవలు అందిస్తున్నారని చెప్పారు. 11న పూలే జయంతి సందర్భంగా ఆర్టీసీ కళాభవన్‌లో పెద్ద ఎత్తున పూలే జయంతిని నిర్వహించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, ఆర్టీసీ ఎండికి విజ్ఞప్తి చేసినప్పటికి గతంలో లాగానే ఇమ్లీ వన్ బస్ స్టేషన్ వద్ద పూలే జయంతి నిర్వహించాలని ఎండి ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి బిసిలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న అంబేద్కర్ జయంతి వలే పూలే జయంతిని కూడా ఘనంగా, వైభవంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బస్ భవన్ ముట్టడించడానికి ఏ మాత్రం వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, ఆర్టీసీ బిసి ఉద్యోగుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.వెంకటేష్‌గౌడ్, గద్దం యాదగిరి, ఉపేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిదర్శనం.. మాజీ కార్పొరేటర్ పావనికి ఘన సన్మానం


గాంధీనగర్ మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్‌లను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి ఏప్రిల్ 4 ( ప్రభాతవార్త ):** గాంధీనగర్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సమీపంలో గల భాగ్యనగర్ కాంప్లెక్స్, సుదర్శన్ ఎలైట్ అపార్ట్‌మెంట్ వాసులు మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్‌లను శనివారం ఘనంగా సన్మానించారు. గత పాతికేళ్లగా పరిష్కారానికి నోచుకోని స్థానిక సమస్యలను ప్రత్యేక చొరవతో పరిష్కరించినందుకు గాను నివాసితులు కృతజ్ఞత సభఏర్పాటు చేశారు. మెట్రో స్టేషన్ నిర్మాణానికి ముందు నుంచే పెండింగ్‌లో ఉన్న వీధి అభివృద్ధి పనులను కార్పొరేటర్ తన హయాంలో పూర్తి చేయించారు. సుమారు రూ. 22 లక్షల జీహెచ్ఎంసీ నిధులతో నూతన సి.సి. రోడ్డు నిర్మాణం, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు పనులు చేపట్టారు. ప్రస్తుతం రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్న పోకిరీల ఆటకట్టించేందుకు, చిక్కడపల్లి పోలీసులతో మాట్లాడి గట్టి నిఘా ఏర్పాటు చేస్తామని పావని వినయ్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఎంతో కాలంగా ఏ నాయకుడూ పట్టించుకోని మా వీధిని మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అభివృద్ధి చేశారు. నూతన రోడ్డు, లైటింగ్‌తో మా ప్రాంత రూపురేఖలు మారిపోయాయి" అని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, పార్టీ నేతలు ఎం. ఉమేష్, సాయి కుమార్, నీరజ్, జ్ఞానేశ్వర్, సాయి తరుణ్ మరియు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కళలు సామాజిక చైతన్యానికి ప్రతీకలు : కల్వ సుజాత

**చిక్కడపల్లి ఏప్రిల్ 4 ( ప్రభాతవార్త ) :** కళలు సామాజిక చైతన్యానికి ప్రతీకలు అని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత అన్నారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లో శ్రీ వాసవి ఆర్ట్స్ , శ్రీ వాసవి లలితకళా సమితి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నయన స్వరాలు తెలుగుహిందీ సినీ సంగీత విభావరి అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా కాల్వ సుజాత ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సభలో ట్రస్ట్ అధ్యక్షులు నమశ్శివాయ, ప్రధాన కార్యదర్శి మాకం బద్రీనాథ్, కోశాధికారి పల్లేర్ల రమేష్, చీఫ్ అడ్వైజర్ డా. చింతల శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ చల్లా సుబ్బారావు, సి.ఏ. కె.చిదంబరం, జాయింట్ సెక్రటరీ బి.రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ లక్ష్మయ్య, ఫౌండర్ ట్రస్టీలు విజయ్ కుమార్ శెట్టి, ఎం. రవి గుప్తా తదితరులు ఉన్నారు. సంగీతం కళలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా, సామాజిక చైతన్యానికి , మానసిక ప్రశాంతతకు ప్రతీకలు అని కొనియాడారు. ఆర్యవైశ్యులందరు సామజిక దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. వాసవి లలితకళా సమితి ట్రస్ట్ గత కొంతకాలంగా కళలను ప్రోత్సహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఖినయన స్వరాలుఖి అనే పేరుతో కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఇటువంటి వినూత్న సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని ఆమె పేర్కొన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా కళాకారులకు, సమాజంలోని నిరుపేదలకు అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయనీ గాయకులు ముక్కంటీశ్వర్ రావు స్వరసారధ్యంలో ఆలపించిన పాత, కొత్త తెలుగు మరియు హిందీ సినీ గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా సోలిస్ ఐ కేర్ హాస్పిటల్ ప్రతినిధులు, డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ వైద్యులు డా. వి. లత, డా. సి. ఎల్. అమృతవల్లి లను సత్కరించారు. నిర్వాహకులు అతిథులను ఘనంగా సత్కరించారు.

## సిపిఐ పోరాటాలకు చేయూతనివ్వండి : పుస్తకాల నర్సింగ్ రావు



అత్తాపూర్ ఏప్రిల్ 4,ప్రభాతవార్త :

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపుమేరకు శనివారం రాజేంద్రనగర్ మండలం ప్రాంతం బుద్వేల్ లో ఇంటింటికి సిపిఐ లో భాగంగా మాస్ క్యాంపెనింగ్ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాలు నర్సింగరావు హాజరై ఇంటింటికి సిపిఐ విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యాపార సంస్థలు స్థానిక ప్రజలను కలిసి భారత కమ్యూనిస్టు పార్టీ గొప్ప చరిత్రను చాటి చెబుతూ విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పుస్తకాల నర్సింగ్ రావు ,మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకుని దేశాన్ని మతోన్మాద కార్పొరేట్ కజంబ హస్తాల నుండి విముక్తి చేసి సమసమాజ స్థాపనకై రాజీలేని పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ వార్త కమ్యూనిస్టు పార్టీ అని కొనియాడారు. దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టులు మరింత బలపడాలని వామపక్ష ప్రజాతంత్ర పురోగామి శక్తులు కోరుకుంటున్నాయని ఈ నిమిత్తంలో తెలంగాణలో ఇంటింటికి సిపిఐ లో భాగంగా పార్టీ కార్యకర్తలు మీ సహాయం కోరుతూ మీ వద్దకు వస్తున్నారని కావున పార్టీ శ్రేయోభిలాషులు వ్యాపారులు కార్మికులు ఉద్యోగస్తులు అన్ని వర్గాల ప్రజలు వంతుగా భారత కమ్యూనిస్టు పార్టీకి విరాళాలు అందించి పోరాటాలపాటికి చేయూతనివ్వాల్సిందిగా తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు రియాజ్ ,జిల్లా కౌన్సిల్ సభ్యులు జె ఆనంద్ గౌడ్ ,మండల సహాయ కార్యదర్శి జె విజయ ఆనంద్ గౌడ్ ,భారత జాతీయ మహిళా సమాఖ్య రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు మునీశ్వరి మండల ఉపాధ్యక్షులు కె వాణి ,కార్యాలయం కార్యదర్శి జి సత్యం ,మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ కాజా, మండలం ఉపాధ్యక్షులు ఎండి సిద్ధిక్ , మండల కౌన్సిల్ సభ్యులు జె సదానంద గౌడ్ ,ఎండి సాబీర్ మోనిక జ్యోతి, ఊర్మిళ, బుజ్జి, అనిత, మధు నాగార్జున సీనియర్ కామ్రేడ్స్ పుష్ప శాంతమ్మ ఎండి ఖలీల్ వెంకట్రావు అఖిల భారత యువజన సమైక్య మండల నాయకులు రాణి, నవీన్ కుమార్, పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలే మేలు : జగదీశ్వర్‌గౌడ్



చందానగర్‌లో చలివేంద్రం ప్రారంభించిన జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛందసంస్థలు,యువజన సంఘాలు ముందుకు రావాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. చందానగర్‌లో డివిజన్‌లో కాంగ్రెస్‌పార్టీ యువజన నాయకులు కట్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసేవలో కాంగ్రెస్‌పార్టీ యువజన నాయకులు ఎల్లప్పుడు ముందుంటారన్నారు.ప్రజల దాహార్తిని తీర్చేందుకు విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలన్నారు. చందానగర్‌లో సీనియర్ కాంగ్రెస్‌పార్టీ నేత కట్ల శేఖర్‌రెడ్డి నిరంతరం ప్రజా సేవలో ఉంటూ సేవాభావంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు కృషిచేయటం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునందన్‌రెడ్డి,హరి,మదు,రజన్,ఉదయ్‌కిరణ్,కార్తిక్, రషీద్, ఖాజా అయాజుద్దీన్,పార్వతి, నజియా, సంతోష్‌యాదవ్;చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# కుల వ్యవస్థపై బ్రాహ్మణ సంఘాలు తమ వైఖరి తెలపాలి

-ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. గోవిందు నరేష్ మాదిగ



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ

హైదరాబాద్, ఏప్రిల్ 4,ప్రభాతవార్త:

కుల వ్యవస్థ రద్దుకు బ్రాహ్మణ సంఘాలు అనుకూలమో, వ్యతిరేకమో తమ వైఖరిని స్పష్టం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోవిందు నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక సంస్కర్త, పద్మశ్రీ మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసే నైతిక అర్హత బ్రాహ్మణ సంఘాలకు లేదని ఆయన మండిపడ్డారు. అన్ని కుల వృత్తుల్లోకి ఇతర వర్గాల వారు చేరడాన్ని స్వాగతిస్తున్న బ్రాహ్మణులు, దేవాలయాల్లో అర్చకులుగా బీసీ, ఎస్సీ, ఎస్టీలు రావడాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. వేద పాఠశాలల్లో శిక్షణ పొంది, పౌరోహిత్యంపై అవగాహన ఉన్న ఎవరికైనా అర్చకత్వం చేపట్టే అవకాశం కల్పించాలని అన్నారు. కులం కంటే పవిత్రమైన జీవన విధానం ముఖ్యం అని తెలిపారు. శ్రీకృష్ణుడు బ్రాహ్మణుల కాళ్లు కడిగి ఆ నీళ్లను నెత్తిన చల్లుకున్నారంటూ బ్రాహ్మణ సంఘాల నేతలు చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది భక్తుల మనోభావాలను, యాదవ సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీశాయని, దీనిపై వారు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు రద్దు చేయాలని మాట్లాడే బ్రాహ్మణులు, కుల వ్యవస్థను రద్దు చేయాలని ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. దమ్ముంటే బ్రాహ్మణులు తమకు వస్తున్న ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వదులుకోవడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. దేశంలో సామాజిక సమానత్వం సిద్ధించే వరకు రిజర్వేషన్లు కొనసాగాల్సిందేనని అంబేద్కర్ ఆశయాలను గుర్తు చేశారు. మూడు దశాబ్దాల పాటు ఏ పదవి ఆశించకుండా మందకృష్ణ మాదిగ చేసిన నిస్వార్థ సేవలను గుర్తించే కేంద్ర ప్రభుత్వంపద్మశ్రీ పురస్కారంతో గౌరవించిందని తెలిపారు. బ్రాహ్మణులకు ఆపద వచ్చినప్పుడు అండగా నిలిచిన చరిత్ర మందకృష్ణ గారిదని ఆయన గుర్తు చేశారు. ఈసమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సిహెచ్ సోమశేఖర్ మాదిగ, ఎంఎస్పి రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగ, జేపీ లతా మాదిగ, కొమ్ము శేఖర్ మాదిగ, టివి నరసింహ మాదిగ, దప్పు మల్లికార్జున మాదిగ తదితర ఎంఎస్పి, ఎంఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## నిజాంపేట, బాచుపల్లి ప్రభుత్వ భూముల కబ్జాపై తక్షణ చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

నిజాంపేట పరిధిలోని సర్వే నంబర్లు 233/22, 24, 25, 26, 27లో ఉన్న సుమారు 13 ఎకరాల ప్రభుత్వ భూమిపై జరుగుతున్న అక్రమ ఆక్రమణలపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్వో కార్యాలయంలో ఫిర్యాదు సమర్పించారు. సర్వే నంబర్ 233/22లో దాదాపు 3000 గజాల ప్రభుత్వ భూమిని కల్వకుంట్ల కన్నారావు ఆక్రమించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. అలాగే సర్వే నంబర్లు 233/24, 25, 26, 27లో ఉన్న సుమారు 13 ఎకరాల లావణ్య పట్టా ప్రభుత్వ భూమిపై కోర్టు ఉత్తర్వులు తమకు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంటూ కొంతమంది ప్రైవేటు వ్యక్తులు, అధికార పార్టీ నేతల మద్దతుతో ఆదివారం ఉదయం నుండి జేసీబీలతో భూమిని చదును చేస్తున్నారని తెలిపారు. దాదాపు రూ.500 కోట్ల విలువ చేసే ఈ ప్రభుత్వ భూమిని కాపాడి, భవిష్యత్తులో మినీ స్టేడియం నిర్మాణానికి కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే బాచుపల్లి పరిధిలోని సర్వే నంబర్ 454లో ప్రభుత్వ భూమిని ఆకృతి కన్స్ట్రక్షన్ సంస్థ అక్రమంగా ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపట్టిందని ఆరోపించారు. ఈ భూమిని కూడా తక్షణమే స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కోర్టు కేసుల్లో సరైన కౌంటర్ దాఖలు చేసి ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని, అలాగే భూములకు ఫెన్సింగ్ వేసి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, సుహాసిని శక్తి, కవితా రెడ్డి, హనుమయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

## మాలల దేవాలయం కూల్చివేతలో కూటమి నాయకులు, అనుచరులపై చర్యలు తీసుకోవాలి

**సైఫాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** ఏపిలోని అకివీడులో మాల కుల గ్రామ దేవత దేవాలయం కూల్చివేతకు పాల్పడి, దీనిని అడ్డుకున్న మాలలపై దారుణంగా దాడికి పాల్పడిన జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, అనుచరులను తక్షణమే అరెస్టు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత విద్వేషాలకు పాల్పడి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన రాష్ట్ర గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సంఘటనలో 50 మంది మాలలపైన అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేశారని, తక్షణమే వారిని విడుదల చేయాలని, బేషరుతుగా కేసులు ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. శతాబ్ద కాలం నుంచి మాల కులదైవమైన గొంతేలమ్మ గుడిని కూల్చి దాని స్థానంలో శ్రీరాముని విగ్రహం పెట్టాలనుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. దళితుల ఆత్మగౌరవంపై దాడులు చేస్తున్న కూటమి పార్టీల నాయకులను కట్టడి చేయకపోతే దళితుల నుంచి ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల వెనుక ఆర్ఎస్ఎస్ హస్తం ఉందని, 350 దళిత కుటుంబాల ఇళ్లను రఘురామకృష్ణంరాజు కూల్చివేశారని, ఈ విషయంపై జాతీయ మానవ హక్కుల కమీషన్ బృందం విచారణ చేపట్టాలని కోరారు. ఈ నెల 10న జాతీయ మానవ హక్కుల కమీషన్‌లో విచారణ జరగనున్నదని ఆయన తెలిపారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

: బేగంబజార్ సిఐ భరత్‌కుమార్



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్.ఐ నర్సింహ్మా

బేగంబజార్,ఏప్రిల్ 4ప్రభాతవార్త:

పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు గాను అనునిత్యం ప్రజలను అప్రమత్తం చేయడం జరుగుతుందని బేగం బజార్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.భరత్‌కుమార్ అన్నారు. నగర పోలీసు కమీషనర్ సి.వి సజ్జన్నార్ ఆదేశాల మేరకుగోల్కొండ జోన్ డిసిపి చంద్రమోహన్ ఆధ్వర్యంలో గోషామహల్ ఎసిపి ఎస్.సుదర్శన్ పర్యవేక్షణలో శనివారం బేగంబజార్ పోలీసులు ప్రజలను కలిసి సైబర్ నేరాలను కరికట్టేందుకుగానుఅవగాహన కల్పిస్తూ, అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా గుర్తు తెలియనినెంబర్ల నుంచి ఫోన్ చేసి మీకు లాటర్లీ వచ్చాయని, పేరుమీద లోన్ మంజూరైందని, లేక క్రెడిట్‌కార్డులు మంజూరైనట్లు సైబర్ నేరాగాళ్లు నమ్మిస్తారని, వారి మాటల ఉచ్చులో పడి (ఓటిపి)లు చెప్పవద్దని సూచించారు. దురాశకు ఆశపడితే మీ బ్యాంకులో ఉన్న డబ్బులు పోతాయని ప్రజలనుహెచ్చరిస్తూ, అప్రమత్తం చేశారు. తరుచుగా ఫోన్ చేసి వేధించే వారిపట్ల అప్రమత్తంగా ఉండి వెంటనే 108 ఫోన్ చేయాలని సూచించారు. ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అడ్వైజర్‌గా కౌటికే విఠల్ నియామకం

చిక్కడపల్లి ఏప్రిల్ 4 ( ప్రభాతవార్త ) :

వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అడ్వైజర్‌గా నగరానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త కౌటికే విఠల్ నియమితులయ్యారు. ఈ మేరకు మహాసభ గ్లోబల్ ప్రెసిడెంట్ రామకృష్ణ తంగుటూరి నియామక పత్రాన్ని జారీ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యుల అభ్యున్నతికి, సంస్థ బలోపేతానికి విఠల్ తన సేవలను అందించనున్నారు. ఈ నియామకం జూన్ 30, 2027 వరకు అమలులో ఉంటుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఆర్యవైశ్యులను ఏకం చేయడంలోనూ, సంస్థలో నూతన సభ్యుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు కౌటికే విఠల్ సంస్థ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు విఠల్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.

## అభివృద్ధి పనుల్లో రాజీ ప్రసక్తే లేదు : బండి రమేష్



కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీ పడబోమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల విషయమై జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిశారు. ఇప్పటికే ప్రారంభమై కొనసాగుతున్న పనులతో పాటు జేఎన్టీయూ చౌరస్తా వద్ద స్కైవాక్, మూసాపేట వై జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ పనులు, సఫ్దర్ నగర్‌లోని హిందూ స్మశాన వాటిక ప్రారంభోత్సవం రాజు కాలనీలోని స్థలాన్ని కమ్యూనిటీ హాల్‌కే కేటాయించాలని, ఈఎస్ఐకి ఇవకూడదనీ రమేష్ చౌహాన్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన ప్రారంభించాల్సిన, అనుమతి పొందిన పనులను వెంటనే ప్రారంబిస్తామని హామీ ఇచ్చారు.

## సనత్ నగర్‌లో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం


సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:

సంజీవరెడ్డి నగర్ పరిధిలోని సనత్ నగర్‌లో శనివారం జూబ్లీహిల్స్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, రమణారెడ్డి హాజరయ్యారు. సనత్ నగర్‌లోని ఎలికో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలకు సైబర్ నేరాలపై వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఓటీపీలు, పాస్‌వర్డ్‌ల భద్రత, బ్యాంకింగ్ మోసాలు, ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తలు, జాబ్ ఫ్రాడ్స్, ఏపికె ఫైళ్ల ద్వారా జరిగే మోసాలు, గేమింగ్, సోషల్ మీడియా మోసాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు లేదా కాల్స్‌పై స్పందించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ ఇన్స్పెక్టర్ అశోక్, పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## యువకుడిపై గ్యాంగ్ దాడి

అత్తాపూర్ ఏప్రిల్ 4,ప్రభాతవార్త :

అత్తాపూర్ లో జహార్ ఇక్బాల్ గ్యాంగ్ రెచ్చిపోయింది. సద్దాం అనే యువకుడిని బైక్ పై కిడ్నాప్ చేసి చింతల్ మెట్ ప్రాంతానికి తీసుకువచ్చారు. అనంతరం అతడిపై విచక్షణారహితంగా కర్రలతో చితకబాది తీవ్రంగా గాయపరచి పారిపోయారు. అందరూ చూస్తుండగానే దాడికి పాల్పడ్డడంతో ఒక్కసారిగా స్థానికులు భయభ్రాంతులకు గురైయ్యారు. గ్యాంగ్ దాడిలో తీవ్రంగా గాయపడిన సద్దాంను స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకునే లోపే దాడికి పాల్పడిన గ్యాంగ్ పారిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్న పోలీసులు సిసికెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

## మహిళపై భార్యభర్తల దాడి

**సికింద్రాబాద్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** భార్యభర్తలు ఇంట్లోకి చొరబడి ఓ మహిళపై దారుణంగా దాడి జరిపారు. అంతే కాకుండా చొరబడ్డ వ్యక్తి ఆ మహిళపై లైంగిక దాడికి ప్రయత్నించాడని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గంగపుత్ర కాలనీలో ఓ మహిళ (30) భర్తతో కలిసి నివసిస్తోంది. భర్త రాంనగర్‌కు చెందిన రాజుతో జులాయిగా తిరుగుతున్నాడు. ఇటీవల బాధిత మహిళ తల్లి రాజుకు ఫోన్‌చేసి నా అల్లుడితో ఎందుకు తిరుగుతున్నావని మందలించింది. దీంతో రాజు, అతని భార్యతో కలిసి బాధిత మహిళ ఇంటికి వచ్చి దాడి జరిపారు. అంతే కాకుండా భార్య ప్రోత్సాహంతో లైంగిక దాడికి ప్రయత్నించాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కులం పేరుతో దూషించిందని అట్రాసిటీ పెట్టినట్లు పోలీసులు తెలిపారు.

## మహనీయుల జయంతి పోస్టర్ ఆవిష్కరణ



మహనీయుల జయంతి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

**అల్లాదుర్గం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మహనీయుల జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని జోగిపేటలో నిర్వహించే కార్యక్రమంకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బహుజన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ నిర్వాహకులు అరిటిక్యాల శంకరయ్య, పి మొగులయ్య, సంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు కాశపాగ ఇమ్మయ్య, బహుజన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎర్రం దేవదాస్, సర్పంచ్‌లు, మాజీ సర్పంచల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు బాల్‌రాజ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, బల్‌రాం, నక్క సూర్యకుమార్, గార్లపల్లి మల్లేశ్, మోహన్ రాథోడ్, రాంచెందర్, సాయిబాబా, తుకారాం, నవీన్, మ్యాదరి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వశిష్ట ది స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

**జిన్నారం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
వశిష్ట ది స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ జరిగింది. ఈవైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు తాము తయారుచెసిన వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించారు. ఇలాంటి ప్రదర్శనలద్వారా విద్యార్థులు తమనైపుణ్యాలను పెంపొందించుకుంటారని, వైజ్ఞానికదృక్పథాన్ని అలవర్చుకుంటారని పాఠశాల కరస్పాండెంట్ లోకానాదం తెలియచేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాంబాబు, ప్రిన్సిపాల్ సుప్రియ, గీతాంజలి స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్, వ్యాస స్కూల్ ప్రిన్సిపాల్ గంగిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

**-మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు**



ఇళ్ల మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
పేదవాడి కలలను నిజంచేయడానికి ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో పారదర్శకంగా ముందుకు వెళ్తున్నట్లు మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. శనివారం మండలకేంద్రమైన చిన్న శంకరంపేటలోని రైతువేదికలో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, ముఖ్యమంత్రి సహాయనిధిచెక్కులు, కళ్యాణలక్ష్మిచెక్కులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాలతి, పార్టీ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, ఆయాగ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## క్యాంప్ కార్యాలయంపై దాడిని ఖండించిన ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్‌గూండాలు చేసినదాడిని పటాన్ చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి అత్యంత దుర్మార్గమని తీవ్రవంగా ఖండించారు. ఈసందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షనేత క్యాంప్‌కార్యాలయంపై దాడిచేయడం కాంగ్రెస్‌పార్టీ దౌర్జన్యానికి నిదర్శమని దుయ్యబట్టారు. గజ్వేల్ పోలీసుఠాణాకు కూతవేటు దూరంలో ఉన్న క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ దాడులు చేయడం రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని రుజువు చేస్తున్నాయని మండిపడ్డారు. పట్టపగలు క్యాంప్ కార్యాలయంలోకి కాంగ్రెస్ గూండాలు చొరబడి ఫర్నిచర్‌ను ధ్వంసంచేయడం, సిబ్బందిని బెదిరించడం, దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడినివారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదర్శ్‌రెడ్డి డిమాండ్‌చేశారు.

## బిఆర్ఎస్‌లో చేరిన కొండపాక వార్డుమెంబర్

**కొండపాక, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
కొండపాక మండల కేంద్రంలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో 5వ వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన మంతూరి అనురాధ శనివారం బిఆర్ఎస్ పారీన్టలో చేరారు. బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు సింగాటం రాములు అధ్వర్యంలో జిల్లా నాయకుడు అనంతుల ప్రశాంత్ సమక్షంలో అమె పార్టీలో చేరగా ప్రశాంత్ అమెకు బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి అహ్వానించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటంచేయాలి

**-బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్‌ముదిరాజ్**

**కొమురవెల్లి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడాలని బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కొమురవెల్లిలో ఆ పార్టీ మండల అధ్యక్షురాలు బుర్గోజు స్వరూప ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణతరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా శనివారం నిర్వహించిన శిక్షణతరగతుల్లో ఆయనపాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీనాయకులు శశిధర్‌రెడ్డి, దండ్యాల లక్ష్మారెడ్డి, తోకల ఉమారాణి, బల్ల శ్రీనివాస్, నాగరాజు, నారాయణ, ఎక్కలదేవి శ్రీనివాస్, కరుణాకర్, కనకయ్య, రాజు, బాలమణి, శ్రీలత, అనిల్, బిక్షపతిచారి, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

## ఖాజాపూర్‌లో దోమలమందు నివారణచర్యలు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని ఖాజాపూర్‌లో శనివారం సర్పంచి బాలస్వామి మురికి కాల్వల వెంట దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయించారు. గ్రామంలోని అన్ని కాలనీల్లో పారిశుధ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు చేపడుతున్నట్లు సర్పంచి బాలస్వామి తెలిపారు.

## బివిఆర్ఐటిలో అంతర్జాతీయ సదస్సు ప్రీలాంచ్

**నర్సాపూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణలోని బివిఆర్ఐటి కళాశాలలో ఈటియుటిఎస్‌ఎవి-2026 అనే అంతర్జాతీయ సదస్సుకు సంబంధించి శనివారం ప్రీలాంచ్‌ను ప్రకటించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిఈ వెర్నోవ డా.పి.బాలకృష్ణ, ప్రఖ్యాతవక్తలు డా.రూపేష్ వాంధరే ఐఐటి హైదరాబాద్, ప్రొఫెసర్ షూయిచీ టోరి కురుమే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, జపాన్ డా.అలీషియా సిన్సువ్, సామ్ రటులాంగి యూనివర్సిటీ, ఇండోనేషియా డా.సలాకి రేనాల్డ్ జోషువా, ఇండోనేషియా హాజరు అవుతారని వెల్లడించారు. సదస్సు నిర్వహణకమిటీకి కళాశాలడైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మీప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దుబేలు నాయకత్వం వహిస్తారని అన్నారు. కార్యక్రమంలో వీరితోపాటు మేనేజర్ బాపిరాజు, ఎఓ సురేశ్ పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు సర్పంచి ఆర్థికసహాయం

**చౌటకూరు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన బిర్ల మల్లమ్మ అంతక్రియలకు గ్రామసర్పంచి గొల్ల మల్లేశం 5వేలరూపాయల ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో మండల యువజనకాంగ్రెస్ ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, ఎన్ఎస్‌యుఐ మండల ఉపాధ్యక్షులు అభిలాష్, మండల సలహాదారు శివకుమార్, వార్డుసభ్యులు అయ్యవారి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొన్యాలలో విద్యార్థినులకు సైకిళ్ళ పంపిణీ

**హత్నూర, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
హత్నూర మండలం కొన్యాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు శనివారం సైకిళ్లను పంపిణీ చేశారు. దూరప్రాంతం నుంచి పాఠశాలలకు వచ్చే ఎంపిక చేసిన విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి ధనంపల్లి సుజాతసత్యం, ఉపసర్పంచి మల్లేశం, హెచ్‌ఎం ఆంజనేయులుగౌడ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాంప్ ఆఫీసుపై దాడి చేయలేదు

**-రేవంత్‌రెడ్డి ఫోటో పెట్టడానికి వెళ్లాం**
**-బిఆర్ఎస్ నాయకుల వదంతులు నమ్మవద్దు**
**-కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి**

**గజ్వేల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై ఎలాంటి దాడిచేయలేదని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి పత్రికాముఖంగా తెలిపారు. శనివారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ క్యాంప్ ఆఫీస్ వద్దకు దాడిచేయాలనివెళ్లలేదని, రేవంత్‌రెడ్డి ఫోటోను క్యాంపు కార్యాలయంలో పెట్టడానికి వెళ్లాము తప్ప అక్కడ ఎలాంటి పరికరాలను ధ్వంసం చేయలేదన్నారు. బిఆర్ఎస్‌నాయకులు లేనిపోని వదంతులు సృష్టించి అభాండాలుమోపాలని చూస్తున్నారన్నారు. అధికార పార్టీలో ఉన్న మేము ప్రభుత్వ ఆస్తులపై దాడిచేస్తామా అని, ఇదంతా బిఆర్ఎస్ నాయకులు ఆడుతున్న డ్రామాగా వర్ణించారు. ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే కెసిఆర్ గజ్వేల్‌లో పర్యటించి ప్రజాసమస్యలను తెలుసుకోవాలని, గజ్వేల్ పట్టణంలో నిరసనతెలియజేయడం జరిగిందని, అందులో భాగంగానే అన్నిప్రభుత్వకార్యాలయాల్లో సిఎం రేవంత్‌రెడ్డి ఫోటోపెట్టడంకోసం కార్యక్రమం చేపట్టామే తప్ప ఏప్రభుత్వభవనాలపై దాడిచేయలేదని కరాఖండిగా తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్లు సర్దార్‌ఖాన్, ప్రభాకర్‌గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, కనకయ్య గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, వెంకటేష్, జిల్లా మైనార్టీసెల్ నేత సమీర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధానకార్యదర్శి నక్క రాములుగౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయిని సత్యలక్ష్మి యాదగిరి, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, జంగం రమేష్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, అజ్గర్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి జరగలేదు

**-మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**

**గజ్వేల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఘటనపై తప్పుడు ప్రచారం జరుగుతుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తెలిపారు. శనివారం స్థానికవిలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తిగా ఉన్న క్యాంపుకార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటం లేకపోవడం గమనించి తమపార్టీ కార్యకర్తలు అక్కడికివెళ్లి చిత్రపటాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యాంపు కార్యాలయం ప్రభుత్వానికి చెందినదని, అక్కడ ముఖ్యమంత్రి చిత్రపటం ఉండడం సహజమన్నారు. అంతేతప్ప అక్కడ ఎలాంటి విధ్వంసం జరగలేదని, కావాలనే బిఆర్ఎస్ నాయకులు వదంతులు సృష్టిస్తున్నారన్నారు. చిన్నవిషయాన్ని పెద్దదిగాచేసి రాజకీయలబ్ధి పొందాలనే ఉద్దేశంతో ఈ రాద్ధాంతం సృష్టిస్తున్నారని, ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకొని తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, నిజానిజాలు బయటపడేలా చూడాలని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## విద్యా అవకాశాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మండలకేంద్రంలో శనివారం స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పిఎం ఎస్‌హెచ్ఆర్ఐ జెడ్‌పిఎస్ కొమురవెల్లి పాఠశాలల ఆధ్వర్యంలో శనివారం భారీర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ గ్రామంలోని ప్రధానవీధులగుండా సాగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైనవిద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్నభోజనం, డిజిటల్‌విద్య, ఆంగ్ల మాధ్యమం, క్రీడలు, ప్రత్యేకశిక్షణ, పిఎం ఎస్‌హెచ్ ఆర్ఐ కార్యక్రమాలను వంటి సౌకర్యాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభించే సౌకర్యాలు, విద్యా అవకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి గొల్లపల్లి పద్మఆంజనేయులు, హెచ్‌ఎం రమేష్, ఉపసర్పంచి, వార్డుసభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి

**-బిఆర్ఎస్ నాయకులు**



దుద్దెడలో విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**కొండపాక, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
గజ్వేల్‌లో మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని కొండపాక మండల బిఆర్ఎస్ పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని నాయకులు పెద్దంకుల శ్రీనివాస్, దోమల ఎల్లం, జిర్రరాజు, గురజాడ బాలాజీ అన్నారు. శనివారం దుద్దెడలో వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చినహామీలను నెరవేర్చకుండా ప్రజలదృష్టిని మరలించడానికి డైవర్ట్ పాలిటిక్స్ రాజకీయాలు చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ చెప్పిన 6 గ్యారంటీలను 420హామీలను ప్రజలు అడుగుతున్నారని, ప్రజలనుండి తప్పించుకోవడానికి దాడులకు ఎగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినహామీలను మరిచిపోయి ప్రజలను మోసం చేస్తుందని, తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సమయంకోసం ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో యాదగిరి, ముత్యంరావు, కనకయ్య, కిషన్, కర్ణాకర్, దేవేందర్, నరేష్, ప్రసాద్, సురేష్, నర్సింలు, గడ్డమిది నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## మంచు కొండల్లో మీ సేవ అమోఘం

**-తన్నీరు హరీష్‌రావు**



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
సిద్దిపేట అన్నదాన కార్యక్రమం గొప్పతనం ఎల్లలు దాటేలా చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం కేదార్‌నాథ్ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో కేదార్‌నాథ్‌లో అన్నదానం కార్యక్రమం చేపట్టే యాత్ర, అక్కడికి పంపే ఆహార పదార్థాల వాహన ప్రారంభ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎముకలు కొరికే చలినిసైతం లెక్కచేయకుండా మంచుకొండల్లో మీరుచేసే సేవ అమోఘమన్నారు. కేదారేశ్వరుని సన్నిధిలో ఆరోసారి సిద్దిపేట అన్నప్రసాదం చేయడం సంతోషంగా ఉందన్నారు. యాత్రికులకు అన్నదాన సేవలు అందించడానికి ఈ సంవత్సరం ఈనెల 22నుంచి ప్రారంభమయ్యే కేదార్‌నాథ్ యాత్రికులకు అన్నప్రసాదం అందించడానికి 14న జిల్లా కేంద్రంలోని శ్రీశరభేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఆహార పదార్థాల వాహనాన్ని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కేదార్‌నాథ్ అన్నదాన సేవాసమితి ప్రతినిధులు చీకోటి మధుసూదన్, గంప శ్రీనివాస్, కాచం కాశీనాథ్, రమేష్, కాశీనాథ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యమా..? రేవంత్‌రెడ్డి గుండా రాజ్యమా..?

**-హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్**

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తుందా, లేక రేవంత్‌రెడ్డి గుండారాజ్యం నడుస్తుందా అని హుస్నాబాద్ మాజీఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యవిలువలను కాపాడవలసిన ప్రభుత్వం అప్రజాస్వామికంగా దాడులుచేయడం సరికాదని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ, ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పూర్తిగా గూండాలరాజ్యంగా మార్చేశారని ఎద్దేవాచేశారు. ప్రధాన ప్రతిపక్ష నేత క్యాంపు కార్యాలయంపైనే దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్లా.. లేనట్లా అని ప్రశ్నించారు. ఒక మాజీ ముఖ్యమంత్రి తెలంగాణ ఉద్యమ రథసారథిపై ఇలా వ్యవహరించడం దుర్మార్గమని, దాడులకు పాల్పడుతున్న గుండాలను పోలీసులు ఎందుకు అడ్డుకోవడంలేదని ప్రశ్నించారు. ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలను ధీటుగా ఎదుర్కొంటామని, రానున్న రోజులలో ప్రజలే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## కెసిఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి అమానుషం

**మాజీ మెదక్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రా గౌడ్.**

**నర్సాపూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణంలో మాజీ సిఎం కెసిఆర్ క్యాంపు కార్యాలయంపై దాడిచేయడం అమానుషమని, దుర్మార్గపుచర్యని ఈదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మెదక్ జిల్లా మాజీ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో మాజీ సిఎం ప్రస్తుత ఎమ్మెల్యే అయిన కెసిఆర్ క్యాంప్‌కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడిచేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ నాయకులు కెసిఆర్‌పై కక్షగట్టి ఈచర్యలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌ప్రభుత్వంలో సిఎం అరాచక పాలన చేస్తున్నారని ఆరోపించారు. మాజీ సిఎం కెసిఆర్ పాలనలో ఏ కార్యాలయం మీద అయినా ఇలాంటి దాడులు జరిగాయా అని ఆయన ప్రశ్నించారు. క్యాంపు కార్యాలయంపై దాడి గుర్తు తెలియని వ్యక్తులు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ఈ దాడికి పాల్పడ్డవారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా రాష్ట్రప్రభుత్వం తగినచర్యలు తీసుకోవాలని జిల్లా మాజీ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# పేదల సొంతింటి కల సాకారమే కాంగ్రెస్ లక్ష్యం

**-అర్హులందరికీ విడతల వారీగా ఇళ్లు**
**-మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు**



రామాయంపేటలో లబ్దిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న దృశ్యం

**రామాయంపేట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
ఇల్లులేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళ పథకాన్ని అమలు చేస్తోందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుతెలిపారు. శనివారం రామాయంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 83మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వ హయాంలో ప్రతి పేదవాడికి సొంత ఇల్లు కల్పించేదిశగా కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. అర్హత కలిగినవారికి ఇల్లు రాకపోతే ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, విడతల వారీగా అందరికీ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, సొంతింటి లక్ష్యంతో ముందుకు సాగుతోందని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్‌డిఈ యాదయ్య, ఎఈ హరిత, ఎంపిడివో షాజీలొద్దిన్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, మానెగల్ల రామకిష్టయ్య, మస్కూరి బాలరాజు, తౌరానాయక్, యాదగిరితోపాటు గ్రామ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజవాడ నాగరాజు, బండారి మహేందర్‌రెడ్డి, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుపేదలకు వరం సిఎంఆర్‌ఎఫ్

**-ఎఎంసి చైర్మన్ సుధాకర్‌రెడ్డి**

**మునిపల్లి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
సిఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరంలాంటిదని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మునిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ ఎం.సుధాకర్‌రెడ్డి పాల్గొని 41మందిలబ్ధిదారులకు సంబంధించిన రూ.14,50,000 సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మునిపల్లి మండల అధ్యక్షులు సతీష్‌కుమార్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, చిన్నచెల్మెడ సర్పంచి గాయత్రిరుద్రకృష్ణ మండలంలోని అన్నిగ్రామాల సర్పంచులు, సీనియర్ నాయకులు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు విజయవంతం



చిత్రపటానికి పూలమాలు వేసిన దృశ్యం

**కొల్చారం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
కొల్చారం మండల పరిధిలోని చిన్న ఘనపూర్ గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 3,4 తేదీలలో బిజెపి ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ తరగతుల మండల కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పంతుల హరీష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ శిక్షణ తరగతుల్లో బిజెపి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు వివిధ అంశాలపై బూత్ అధ్యక్షులు, శక్తికేంద్రం ఇంచార్జీలు, మండల కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు పంతుల హరీష్ మాట్లాడుతూ, బిజెపి ఒక సిద్ధాంతపరంగా నడిచే పార్టీ అని, ఏకాత్మ, మానవతావాదం, అంత్యోదయ సిద్ధాంతాలను నమ్మిన పార్టీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, శక్తికేంద్రం ఇంచార్జీలు, బూత్ అధ్యక్షులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన హరీష్‌రావు

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సిద్దిపేట పట్టణంతోపాటు నంగునూర్ మండల పరిధిలోని వివిధగ్రామాల్లో శనివారం పర్యటించి పలువురు బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుండు భూపేష్ తల్లి మరణించడంతో ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే సిద్దిపేట చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు చిర్లంచ జనార్ధన్ తమ్ముడు సత్యం ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. ఆయనవెంట పార్టీనాయకులు కొండం సంపత్‌రెడ్డి, రాజనర్సు, పూజల చిన్నా తదితరులు ఉన్నారు.

**నంగునూర్‌లో...**
నంగునూర్ మండల పరిధిలోని నర్మెట గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు రాజిరెడ్డి తల్లి మృతిచెందగా అమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. అదే గ్రామంలో విద్యార్థి విభాగం నాయకులు అప్పాల శేఖర్ నానమ్మ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అలాగే మాజీ వార్డుసభ్యులు బాబు అమ్మ, విద్యుత్ షాక్‌తో ఇటీవల మృతిచెందిన శ్రీనివాస్‌రెడ్డి కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.

## ఈ నెల 17న పద్మశాలి సంఘం ఎన్నిక

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
ఈనెల 17న మండల పద్మశాలిసంఘం మండల ఎన్నికలు జరుగనున్నట్లు ఆ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు జయరాములు శనివారం చిన్నశంకరంపేటలో తెలిపారు. కావున మండలంలోని పద్మశాలీలు అధిక సంఖ్యలో ఎన్నికలో పాల్గొనాలని ఆయన కోరారు.

## పేదప్రజల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

**-కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి**

**ములుగు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
పేదప్రజల సొంతింటి కలను నెరవేర్చడంతో పాటు మహిళల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పనిచేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి పేర్కొన్నారు. శనివారం ములుగు మండల పరిధిలోని అచ్చాయిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులైన జలాల్‌పురం కృష్ణవేణి దశరథల ఇంటి గృహప్రవేశానికి సర్పంచి బుర్కాల మమత కనకయ్య పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డి, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు కడపల నరసింహారెడ్డి, జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యులు సలీంతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, ఎవరెన్ని చేసినా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తివిశ్వాసంతో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి, బొల్లారం సర్పంచి ముత్యంరెడ్డి, స్థానిక ఉపసర్పంచి లక్ష్మీస్వామి, వార్డుసభ్యులు సత్తయ్య, శివ, వినోద్, మమతరాజు, లక్ష్మీనరసింహులు, గ్రామకార్యదర్శి శ్రీలత, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, మణి పవన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో ర్యాంకు సాధించిన విద్యార్థికి ఘనసన్మానం

**దౌల్తాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
జవహర్ నవోదయ విద్యాలయ(జెఎన్‌వియస్‌టీ) 2026 ప్రవేశపరీక్షలో అద్భుత ప్రతిభకనబరిచిన కొడంగల్‌నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం గోకఫస్లావాద్‌గ్రామంలోని పైనీయర్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్‌లో చదువుతున్న ఎల్.జి.తండాకు చెందిన విద్యార్థి సబావత్ గౌతమ్‌ను పాఠశాల యాజమాన్యం శనివారం ఘనంగా సన్మానించింది. జవహర్ నవోదయ (జెఎన్‌వియస్‌టీ-2026) ఫలితాల్లో గౌతమ్ 90మార్కులు సాధించి,33వ ర్యాంకుతో ఆరోతరగతి ప్రవేశానికి ఎంపికయ్యాడు. ఈసందర్భంగా విద్యార్థిని సత్కరించి వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించండి

**-5శాతం ఎర్లీ బర్డ్ రాయితీ: డిసి వాణి**

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
ప్రజలు తమ ఇంటిపన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి తెలిపారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఘట్‌కేసర్, ఎదులాబాద్ డివిజన్లలోని కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులకు ఆస్తిపన్నుపై 5శాతం ఎర్లీబర్డ్ రాయితీపై అవగాహన కల్పించారు. ఈనెల 30లోగా ఇంటిపన్నులు చెల్లిస్తే ప్రభుత్వం 5శాతం రాయితీ కల్పిస్తుందని, ప్రజలు ఈప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రజలు తమ ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని నిధులు సమకూర్చితే అభివృద్ధి పనులు చేపట్టడానికి అవకాశాం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా డివిజన్లలో సమస్యలను ఆమె మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీ నాయకులను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆస్తిపన్ను ఎర్లీబర్డ్ రాయితీపై తమ కాలనీల్లో ప్రజలకు తెలియజేయాలని ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని డిసి వాణి వారికి సూచించారు.

# పిహెచ్‌సిలో ఎమ్మెల్యే హరీష్‌రావు ఆకస్మిక తనిఖీ

-ఆసుపత్రిలో వైద్యసేవలపై ఆరాతీసిన తన్నీరు హరీష్‌రావు



హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న హరీష్‌రావు

**నంగునూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
రోజూ ఎంతమంది పేషెంట్స్ వస్తున్నారు? మందులు అందుబాటులో ఉన్నాయా? అంటూ నంగునూర్ మండలం గట్లమల్యాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. సకాలంలో డాక్టర్లు అందుబాటులో ఉండాలని పేదప్రజలకు వైద్యసేవలు అందించాలానే లక్ష్యంతో గట్లమల్యాలలో వాగు అవతలి గ్రామాల ప్రజలకు వైద్యసేవల కోసమే ఏర్పాటు చేశామన్నారు. పేదలకు వైద్యసేవలు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దన్నారు. రోజువారీ పేషెంట్స్ వివరాల రిజిస్టర్‌ను పరిశీలించారు. బ్లడ్ శ్యాంపిల్స్ ఎప్పటికప్పుడు టి డయాగ్నోస్టిక్‌కి పంపాలని ఒక్క రోజుల్లోనే రిపోర్టు వారికి అందించాలన్నారు.

**అమ్మవారి దయతో మళ్లీ మంచి రోజులొస్తాయి...**
పెద్దమ్మతల్లి దయతో మళ్లీ మంచిరోజులొస్తాయని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. మండల పరిధిలోని గట్లమల్యాలలో పెద్దమ్మతల్లి వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గట్లమల్యాలతోపాటు వాగు అవతల గ్రామాలకు విద్య, వైద్యం సాగునీరు అందించామన్నారు. గట్లమల్యాల అభివృద్ధికి ఎప్పటికీ నా వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు, కెసిఆర్ సహకారంతో గ్రామాలను దినదినాభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

**బెజ్జంకి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మండలకేంద్రంలోని ఏకశిలకొండపై కొలువుదిరిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగానిర్వహించారు. ఈమహోత్సవంలో ముఖ్యఘట్టం అయిన గుట్ట చుట్టూ రథంతిరిగే కార్యక్రమం శనివారం కన్నులపండువగా సాగింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహ స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ పాలకవర్గం తగు ఏర్పాట్లుచేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, ఎస్ఐ సౌజన్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

## ఘనంగా పెరుమాండ్ల జాతర

**బెజ్జంకి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని కల్లెపల్లిగ్రామంలో బండ్ల పెరుమాండ్ల జాతర వైభవంగా నిర్వహించారు. గుడిచుట్టూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, మేకలబండ్లతో తిప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, ఎస్ఐ సౌజన్య, సర్పంచి బిగుళ్ల మోహన్, ఉపసర్పంచి శశివినీత్, పాలకవర్గం, గ్రామప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు కష్టాలు ఉండవు

-సర్పంచి ఇప్ప పెంటారెడ్డి



ఇందిరమ్మ గృహం ప్రారంభిస్తున్న సర్పంచి దృశ్యం

**గుమ్మడిదల, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
గుమ్మడిదలమండలంలోని కానుకుంటగ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు బ్యాగరి సుశీల గృహప్రవేశం కార్యక్రమాన్ని గ్రామసర్పంచి ఇప్ప పెంటారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో పేదలందరికి సొంత ఇంటి కల నెరవేరుతోందని తెలిపారు. కార్యక్రమంలో మాజీసర్పంచి బేకు నీలమ్మ, ఉపసర్పంచి పాషా, వార్డుసభ్యులు, కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షులు అంజాత్‌ఖాన్, ఇందిరమ్మకమిటీ సభ్యులు, కాంగ్రెస్‌పార్టీ గ్రామ నాయకులు, కుమ్మరి వెంకటేష్, దయాకర్‌రెడ్డి, సుధాకర్, గడ్డం యాదగిరి, మురళి, తుడుం ప్రేమ్‌కుమార్, కుమ్మరి పెంటేష్, పెద్దలు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయానికి కొత్త రూపు



నేటి తహసీల్దార్ కార్యాలయం దృశ్యం

**గుమ్మడిదల, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
గుమ్మడిదలమండలంలో సంవత్సరాలుగా నిర్లక్ష్యానికిగురై పాడుబడిపోయిన గ్రామపంచాయతీ భవనం, ఇప్పుడు ప్రజలకు సేవలందించే ఆధునిక తహసీల్దార్ కార్యాలయంగా మారింది. తాత్కాలికంగా అక్కడే కార్యాలయం నిర్వహిస్తూ వచ్చిన సిబ్బంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, మండల తహసీల్దార్ పరమేశం ఆదుస్థితిని గమనించి వెంటనే చర్యలు చేపట్టారు. పాతబడిన గోడలు, లీకేజీలు, అసౌకర్యాలు మధ్య పనిచేస్తున్న సిబ్బంది పరిస్థితి ఆయనను కలచివేసింది. ప్రజలపనులు ఆలస్యంకాకుండా, అధికారులకు సరైనవాతావరణం కల్పించాలని సంకల్పించిన తహసీల్దార్ పరమేశం, కార్యాలయాన్ని పూర్తిగా పునరుద్ధరించేందుకు ముందుకొచ్చారు. భవనానికి మరమ్మతులుచేసి, ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని సృష్టించారు. ఈమార్పు స్థానికప్రజల్లో ఆనందాన్ని నింపింది. ఇప్పటివరకు ఇబ్బందులతోసాగిన పనులు, ఇప్పుడు వేగంగా, సులభంగా జరుగుతున్నాయి. ఈపరిణామంతో ప్రజలు, నాయకులు తహసీల్దార్ పరమేశంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. మారిన ఈకార్యాలయం నిజమైన అభివృద్ధికి నిదర్శనమని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

## జిల్లా జడ్జిలను మర్యాదపూర్వకంగా కలిసిన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



జడ్జిలను మర్యాద పూర్వకంగా కలిసిన నూతన పాలకవర్గం

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
సిద్దిపేట జిల్లా కేంద్రంలో జిల్లా జడ్జిలు సాయిరామదేవి, జయప్రసాద్‌లను హుస్నాబాద్ బార్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్‌కు డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయడానికి అనుమతి కల్పించాలని వారు జిల్లా జడ్జిలను కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిని మల్లేశం, ఉపాధ్యక్షుడు బాకం సంపత్, సభ్యులు కన్నూజు రామకృష్ణ, బోయిని సదన్, కొంకట శ్రీనివాస్, జె.కిరణ్‌కుమార్, దీకొండ ప్రవీణ్‌కుమార్, బండ సంధ్యారాణి, సబ్బాని శ్రీదేవి, ఉప్పరపల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా రోడ్డు ప్రయాణం

-పట్టించుకోని పాలకులు, అధికారులు

**నారాయణఖేడ్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్‌గిద్ద, సిర్గాపూర్, కంగ్టి, కల్హేర్ మండలాలతోపాటు పరిసరగ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలతో నిండిపోయి అత్యంతదయనీయ స్థితిలో ఉన్నాయని నారాయణఖేడ్ ఎంఐఎం అధ్యక్షులు, న్యాయవాది మొహీద్‌పటేల్ పేర్కొన్నారు. ఈరహదారులపై ప్రయాణిస్తున్న వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఈపరిస్థితి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తూ, ప్రతిసారి మన నియోజకవర్గానికి చెందిన ఎంపి అని చెప్పుకోవడం తప్ప, అభివృద్ధిపనుల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని అన్నారు. రహదారుల అభివృద్ధి విషయంలో పూర్తిగా శూన్యత నెలకొన్నదని ఆయన ఆరోపించారు. అదేవిధంగా, మోర్గిబ్రిడ్జ నిర్మాణం చాలాకాలంగా అసంపూర్ణంగా ఉండటంపట్ల కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఇంత కాలం గడిచినా బ్రిడ్జ పనులు పూర్తికాకపోవడం వెనుక కారణాలేమిటని నిలదీశారు. ఇప్పటికైనా నియోజకవర్గ ఎంపి, ఎమ్మెల్యే, నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ స్పందించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని మొహీద్‌పటేల్ డిమాండ్‌చేశారు.

## బిఆర్‌ఎస్‌కు నుండి కాంగ్రెస్‌లోకి..



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న హరికృష్ణ, అత్తు

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిననాటి నుంచి నేటివరకు అన్నివర్గాల ప్రజలు, రైతులు, మహిళల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎండి.ఇమామ్(అత్తు)లు అన్నారు. జిల్లా కేంద్రంలోని 11వ వార్డుకు చెందిన పలువురు బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆపార్టీకి రాం రాం చెప్పి శనివారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరినవారికి వారు పార్టీకండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొమ్మల యాదగిరి, లక్ష్మీ, అర్షద్, గయాజుద్దీన్, విజయ్, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తు ప్రేమను చాటి చెప్పేదే రన్ ఫర్ జీసస్

-టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
ఈస్టర్ సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంగారెడ్డి పట్టణంలోని ఓల్డ్‌బస్టాండ్ అంబేద్కర్‌విగ్రహం నుండి పోతిరెడ్డిపల్లి చౌరస్తా, అక్కడినుండి సిఎస్ఐ చర్చ్‌వరకు భారీర్యాలీ నిర్వహించారు. కీర్తనలు పాడుతూ, నృత్యాలుచేస్తూ క్రీస్తును స్మరించుకున్నారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధానకార్యదర్శి తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కూన సంతోష్‌లతో పాటు యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం. నాయకులు రూబీన్‌రెడ్డి, ప్రవీణ్, సునీల్, నిర్మల్‌కుమార్, మధు, మోహన్, సునీల్ జై కుమార్, పాస్టర్లు రెవరెండ్ జార్జ్ ఎబినైసర్, రెవరెండ్ మధు కుమార్, రెవరెండ్ జాన్ పీటర్, సత్యానంద్, సత్యపాల్ పాల్గొన్నారు.

## గాలి అనిల్‌కుమార్‌కు కాంగ్రెస్‌లో కీలక బాధ్యతలు

-నర్సాపూర్, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గాల బిఎల్‌ఏగా నియామకం

**కొల్చారం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గాలి అనిల్‌కుమార్‌కు ఆపార్టీ అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించింది. నర్సాపూర్, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గాల బూత్ లెవెల్ కోఆర్డినేటర్‌గా గాలి అనిల్‌కుమార్‌ను నియమిస్తూ పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా గాలి అనిల్‌కుమార్‌కు ఈరెండు నియోజకవర్గాల్లో గట్టి పట్టుంది. కార్యకర్తల కష్టాల్లో వెన్నుదన్నుగా ఉండే నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయన సేవలను గుర్తించి ఈమేరకు కీలకబాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

## హత్నూర తైబజార్ వేలం 3లక్షల 16వేలు



హత్నూర తైబజార్ వేలంలో పాల్గొన్న గ్రామస్థులు

**హత్నూర, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన హత్నూర గ్రామపంచాయతీ తైబజార్ వేలం శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామస్థుల సమక్షంలో నిర్వహించారు. బహిరంగ వేలం ద్వారా నిర్వహించిన ఈ వేలాన్ని హత్నూర గ్రామానికి చెందిన కొండేగళ్ల రవికుమార్ మూడులక్షల 16వేల రూపాయలకు దక్కించుకున్నారని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎల్లయ్య పంచాయతీ కార్యదర్శి మజర్ అలీ, ఉపసర్పంచి, వార్డుసభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ నేతల ముందస్తు అరెస్టు




అల్లాదుర్గంలో బిఆర్‌ఎస్ నేతలను అరెస్టుచేసిన పోలీసులు

**అల్లాదుర్గం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి సీఐడి నోటీసులను అందిస్తున్న నేపథ్యంల బిఆర్‌ఎస్ నేతలు పెద్ద ఎత్తున హైద్రాబాద్ తరలివెళుతుండటంతో అల్లాదుర్గం పోలీసులు మండల బిఆర్‌ఎస్ నేతలను ముందస్తుగా అరెస్టు చేసి అల్లాదుర్గం పోలీసు ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ పాడి కౌశిక్‌రెడ్డికి సీఐడి నోటీసులు అందచేయడం అన్యాయమని బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు నర్సింలు, నాయకుఉలు మాజీ ఉప సర్పంచ్ నరసప్ప, బేతయ్య, శివరాం, మోహన్ రాథోడ్, సంతోష్ నాయక్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సిర్గాపూర్ తై బజార్ వేలం

-పంచాయతీకి 2.21లక్షల ఆదాయం



సిర్గాపూర్‌లో తైబజార్ వేలం వేస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని గ్రామ పంచాయితీలో శనివారం తైబజార్ వేలం నిర్వహించారు. తైబజార్ వేలంపాటలో 18మంది పాల్గొనడంతో నువ్వా నేనా అంటూ పాట పాడటంతో గత ఏడాది కంటే ఈ మారు పంచాయతీకి తైబజార్‌తో అధిక ఆదాయం దక్కింది. గత ఏడాది తైబజార్ వేలంలో పంచాయతీకి 1లక్ష 52వేల రూపాయల ఆదాయం సమకూరగా ఈ మారు 2లక్షల 21వేల రూపాయల ఆదాయం వచ్చిందని పంచాయతీ కార్యదర్శి నవీన్‌రెడ్డి తెలిపారు. సిర్గాపూర్‌కు చెందిన బాగువాన్ ఖాజా సాహెబ్ వేలంపాటలో అధికమొత్తం పాడి తైబజార్‌ను దక్కించుకున్నారు.

## మహనీయుల జయంతి పోస్టర్ ఆవిష్కరణ



మహనీయుల జయంతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**పుల్‌కల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
ఉమ్మడిపుల్‌కల్ మండలంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డుసభ్యులు, బహుజననాయకులతో కలసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ నిర్వాహకులు అరిటిక్యాల శంకరయ్య, పొట్టిపల్లి మొగులయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, సంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య, బహుజన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎర్రం దేవదాస్, సర్పంచులు రమేష్, యాదగిరి, భాస్కర్, ఉపసర్పంచి నత్తి సందీప్‌కుమార్, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఎర్రోళ్ల రమేష్, మ్యాదరి కరుణాకర్, గార్లపల్లి మల్లేశం, అంబేద్కర్ సంఘాల నాయకులు ఉప్పరి దేవదాస్, అనిల్, శ్రీకాంత్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ అగ్నిగుండం అవుతుంది

-దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హెచ్చరిక

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
గజ్వేల్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడం తీవ్రంగా ఖండనీయమని దుబ్బాక ఎమ్మెల్యే, సిద్ధిపేటజిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చేలా జరిగిన ఈఘటనను ఏవిధంగానూ సహించబోమని ఆయన స్పష్టంచేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకత్వంపై ఇలాంటి దాడులుచేయడం కాంగ్రెస్ నాయకుల నిర్లక్ష్యానికి, అసహనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈఘటనకు సంబంధించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 24 గంటల్లో చర్యలు తీసుకోకపోతే తెలంగాణ అగ్గిబరాటాగా మారుతుందని హెచ్చరించారు.

## నర్సాపూర్‌లో రన్ ఫర్ జీసస్ ర్యాలీ

**నర్సాపూర్ ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో శనివారం క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నర్సాపూర్ పట్టణంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్, కౌన్సిలర్లు సుధీర్‌గౌడ్, నరసమ్మ, కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులుగౌడ్, రషీద్, సిఎస్ఐ చర్చి పాస్టర్ సందీప్‌కుమార్, అమృతయ్య, కాంతారావు, కమిటీ మెంబర్స్ సాగర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో రన్ ఫర్ జీసస్ ర్యాలీ

-రన్ ఫర్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి



ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్

**జహీరాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంలో శనివారం క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీని శాంతియుతంగా, ఉత్సాహంగా నిర్వహించారు. ర్యాలీని పాస్టర్లు జండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ర్యాలీ ఎంఆర్‌హెచ్‌ఎస్ మైదానం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారి గుండా కొనసాగింది. ర్యాలీలో క్రైస్తవులు ప్రత్యేకమైన టీ-షర్టులు ధరించి క్రీస్తు కీర్తనలు ఆలపిస్తూ నిర్వహించడం ఆకర్షణగా నిలిచింది. ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులకు మున్సిపల్ కౌన్సిలర్ నామ స్రవంతిరవికిరణ్ తన స్వంతఖర్చులతో ఏర్పాటుచేసిన శీతల పానీయాలు, తాగునీటిని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రారంభించి క్రైస్తవులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీమంత్రి డాక్టర్ చంద్రశేఖర్, కోహీర్, జహీరాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు సంపత్‌కుమార్, ఇర్మియ, మహేష్, ఎస్సీ కార్పొరేషన్ మాజీచైర్మన్ వై.నరోత్తం, కౌన్సిలర్లు మహిపాల్ యాదవ్, విజయరాజు, స్వప్నప్రవీణ్, దీపక్, సుజిత్, విశ్వేశ్వర్, నాయకులు బండి మోహన్, సర్పంచి మచ్చేందర్, రవికిరణ్, నరేష్‌రెడ్డి, నిఖిల్ ముదిరాజ్, ఇజ్రాయిల్ బాబీ, శివప్ప, బండి మోహన్, నాథన్, ప్రవీణ్, జోన నరేష్, లవన్, ప్రవీణ్, తరుణ్, జాను, రాజు, ప్రేమ్, రవి, ఉల్లాస్, సందీప్, అనిల్, ప్రశాంత్, మహేష్, సందీప్, రాక్‌స్టారర్, ఆయాచర్చిల పాస్టర్లు, క్రైస్తవసంఘాల నాయకులు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాశ్రేయస్సే రాష్ట్ర సర్కార్ ధ్యేయం

-నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
ప్రజల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకొని రాష్ట్ర సర్కార్ ముందుకు సాగుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 120మంది లబ్దిదారులకు శనివారం రూ.45లక్షల 25వేలు సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీచేసి మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం, ప్రజాశ్రేయస్సే రాష్ట్రసర్కార్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎండి.ఇమామ్(అత్తు), పార్టీ నాయకులు బొమ్మల యాదగిరి, కలీం, లక్ష్మీ, అంజయ్య, బిక్షపతి, అంజిరెడ్డి, పద్మ, అర్షద్, అజ్మాత్, శ్రీనివాస్, అర్షద్, వాహబ్, మెరుగు రాజు, శ్రీనివాస్ రెడ్డి, సలీం, కొంగ సాంబమూర్తి, రాజిరెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గూండాలను అరెస్ట్‌చేయాలి

-మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



సిఐ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయంలో దాడిచేసిన కాంగ్రెస్ గూండాలను 24 గంటలలోపు అరెస్ట్ చేయాలని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి శనివారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవిధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందన్నారు. తెలంగాణలో ప్రజాపాలనలేదు కాని కాంగ్రెస్‌పార్టీ గూండాలపాలన నడుస్తుందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న క్యాంప్ కార్యాలయంపై దాడిచేస్తే పోలీసులు సైతం ప్రభుత్వానికి కొమ్ము కాస్తున్నారన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో దాదాపు 95వేల మంది బిఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నారని, ఒక్క పిలుపు ఇస్తే 20వేల మంది కార్యకర్తలు రోడ్డుమీదకు వస్తారన్నారు. పోలీసులు అరెస్ట్ చేయలేని పక్షంలో పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. పట్టపగలే క్యాంప్ ఆఫీసుపై దాడి చేయడం చూస్తే అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఆటలాడడమే అన్నారు. ఇప్పటికైనా క్యాంప్ ఆఫీస్‌పై దాడిచేసిన కాంగ్రెస్ నాయకులను గుర్తించి అరెస్ట్‌చేయాలని డిమాండ్‌చేశారు. ఆయన వెంట గజ్వేల్ మాజీ ఎఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, దేవి రవీందర్, అజార్, నూనె కుమార్ యాదవ్, గంగిశెట్టి రవీందర్, కళ్యాణ్‌కార్ నర్సింగరావు, నవాజ్ మీరా, గడియారం స్వామిచారి, బొగ్గుల చందు, ఊడెం కృష్ణారెడ్డి, బెండె మధు, కరుణాకర్‌రెడ్డి, ఉమర్, జకియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలకు అభివృద్ధి

-టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలాజగ్గారెడ్డి

**కొండాపూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:**
కొండాపూర్ మండలపరిధిలోని గంగారం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయి. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. గ్రామ అభివృద్ధిలో భాగంగా ఎన్‌ఆర్‌ఈజిఎస్ నిధులతో రూ.20లక్షల వ్యయంతో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి హాజరై, గ్రామ సర్పంచి సరితఅశోక్‌తో, ఉపసర్పంచి సంతోషశేఖర్, వార్డ్ మెంబర్లు అనిల్ కలిసి శంకుస్థాపన చేశారు. ఆమె గ్రామంలోకి రాగానే ప్రజలు డప్పుచప్పుళ్లతో, బాణాసంచా కాల్చుతూ ఘనస్వాగతం పలికారు. గ్రామవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి కార్యక్రమాలను పండుగను తలపించేలా నిర్వహించారు. గ్రామపెద్దలు, నాయకులు శాలువాలతో సత్కరించి గ్రామ అభివృద్ధిపై తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన నిర్మల పూర్తి అయిన ఇళ్లకు ప్రారంభోత్సవం నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధానలక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు కల్పించడం, అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయడం మాబాధ్యత అని తెలిపారు. అదేవిధంగా గ్రామభద్రతను దృష్టిలో ఉంచుకుని సిసి కెమెరాలను ఏర్పాటుచేశారు. నేరాల నియంత్రణ, ప్రజలరక్షణకోసం పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతంచేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమపథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడివో వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి మంజుల, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ అలవేణినరసింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్, మాజీఎంపిపి యాదయ్య, మాజీసర్పంచి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.